క్లుప్తంగా

నాణ్యమైన విత్తనాలతో మంచి దిగుబడి



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

హవేళిఘణాపూర్(మెదక్): రైతులు శాస్త్రవేత్తల సిఫార్సు మేరకు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని ఏఈఓ రాఖేశ్ సూచించారు. శనివారం మండల పరిధిలోని ఔరంగాబాద్ తండాలో ఇటీవల ప్రభుత్వ యూనివర్సిటీ ద్వారా పంపిణీ చేసిన ఎంటీయూ 1010 వరి పంటను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాలతో పాటు సేంద్రియ ఎరువుల వాడకంతో మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు రవి, ఫూల్‌సింగ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ



విద్యార్థులకు షూ అందజేస్తున్న ఎంఈఓ

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయం సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బుచ్చనాయక్ అన్నారు. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం కవాడిగూడ జగతి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో షూ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. జగతి ఫౌండేషన్ కార్యదర్శి రామచంద్రమూర్తి మాట్లాడుతూ రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు హిందూమతి, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే స్వచ్ఛత సాధ్యం



అజ్జమర్రిలో స్వచ్ఛభారత్ పనులు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): పరిసరాల పరిశుభ్రతతో ఎలాంటి వ్యాధులు దరిచేరవని బీజేపీ మండల అధ్యక్షుడు నగేష్‌యాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని అజ్జమర్రిలో పీఎం నరేంద్రమోదీ పుట్టినరోజు సందర్భంగా సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ మేరకు గ్రామంలోని పరిసరాలు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సమష్టి కృషితోనే స్వచ్ఛత సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు సత్యనారాయణ, వెంకటేశం, మాజీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, నాయకులు అశోక్, శ్రీనివాస్, భిక్షపతి పాల్గొన్నారు.

బీఎల్‌ఓలతో సమీక్ష

శివ్వంపేట(నర్సాపూర్): ఓటర్లు లిస్టులో నెలకొన్న తప్పులను సవరించాలని తహసీల్దార్ కమలాద్రి, ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్ అన్నారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా వివరాలను సమగ్రంగా తయారు చేసి నివేదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కిషన్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సంతోష, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఫర్నీచర్ అందజేత

మనోహరబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ ప్రాథమిక పాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు ప్రతినిధులు ఫర్నీచర్ అందజేశారు. ఈ సందర్భంగా కుద్బుల్లాపూర్ బ్యాంకు ఏజీఎం తేజ్‌దీప్ మాట్లాడుతూ పాఠశాలలో తాగునీరు, ఫర్నీచర్ సమస్య ఉందని తెలుసుకొని వాటిని తీర్చేందుకు ఫర్నీచర్, కుర్చీలు అందజేసిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశ్, ప్రధానోపాధ్యాయురాలు ప్రియాంక, నాగప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆర్టిజనుల ముందస్తు అరెస్ట్

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో శనివారం విద్యుత్ ఆర్టిజనులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఆర్టిజన్ల జేఏసీ ఏర్పాటుకు బయలుదేరుతున్న తరుణంలో పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే అక్రమ అరెస్టులకు భయపడేది లేదన్నారు. ఆర్టిజన్ల సమష్టి కృషితో జేఏసీ ఏర్పాటు చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

● బతుకమ్మ సంబరం

తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ సంబురాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎక్కడాలేని విధంగా పూలను పూజించే సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ పండగను 9 రోజుల పాటు మహిళలు అంగరంగా వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో, కార్యాలయాల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మలు పేర్చి ఆటలాడారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మహిళా ఉద్యోగులు బతుకమ్మ సంబురాల్లో పాల్గొని సందడి చేశారు.



మెదక్‌జోన్: రామాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



రామాయంపేట మంజీరా విద్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



పెద్దశంకరంపేటలో బతుకమ్మ వేడుకలు



నర్సాపూర్: లక్ష్మీనారాయణ స్వామి ఆలయం ఎదుట బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చిన్నశంకరంపేట: గజగట్లపల్లిలో ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



నర్సాపూర్ రూరల్: బతుకమ్మతో ఆర్డీఓ మహిపాల్, ఉపాధ్యాయులు



టేక్మాల్ మోడల్ స్కూల్‌లో బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు



మనోహరబాద్ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు విద్యార్థినులు

సదస్సులతో విద్యార్థులకు మేలు

నర్సాపూర్: సదస్సులతో విద్యార్థులకు మేలు జరుగుతుందని అజైల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్లు పృథ్వీరాజు, స్నిగ్ధ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బీవీఆర్ఐటీ కాలేజీలో ఇంజనీర్స్‌డేను పురస్కరించుకుని శనివారం విష్ణు నేషనల్ లెవెల్ 6 అవర్స్ కాడథాన్-బిల్డ్ విజన్ 2025 సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కో ఆర్డినేటర్లు మాట్లాడుతూ.. సదస్సులు, సమ్మేళనాలతో విద్యార్థులు తమ ప్రతిభను వ్యక్తం చేసే అవకాశం ఉంటుందన్నారు. ఇంజనీరింగ్ ప్రాధాన్యత, ఆవిష్కరణ వంటి పలు అంశాలను వివరించారు. ఈ సదస్సుకు వివిధ కాలేజీల నుంచి 25 విద్యార్థుల జట్లు పాల్గొని సృజనాత్మక మోడల్స్, డిజైన్ కాన్సెప్టులు, ప్రాజెక్టుల ఆలోచనలు ప్రదర్శించారని కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ వివరించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, కన్వీనర్ కృష్ణరావు, ఇతర ప్రతినిధులు కలప్ప, శివరాజ్, అభయ్, బాపిరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో అధ్యాపకులు, విద్యార్థులు

నార్కోటిక్ జాగిలాలతో ఆకస్మిక తనిఖీలు



చిన్నశంకరంపేటలో తనిఖీ చేస్తున్న నార్కోటిక్ డాగ్‌స్క్వాడ్ బృందం

చిన్నశంకరంపేట(మెదక్): డ్రగ్స్, గంజాయి నివారణకు మండల కేంద్రంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో నార్కోటిక్ జాగిలాలతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. శనివారం జిల్లా కేంద్రానికి చెందిన నార్కోటిక్ జాగిలాల బృందం, స్థానిక పోలీసులు నార్కోటిక్ డాగ్, బాంబ్ స్క్వాడ్‌తో కలిపి తనిఖీలు చేపట్టారు. అనంతరం మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫామ్, వేయిటింగ్‌హాల్‌ను తనిఖీ చేశారు.

చేగుంటలో తనిఖీలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని బస్టాండ్ రైల్వే స్టేషన్‌లతో పాటు దాబాల్లో శనివారం డాగ్ స్క్వాడ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇటీవల డ్రగ్స్‌కు సంబంధించి కేసులు నమోదవుతున్న నేపథ్యంలో డ్రగ్స్ వాడ్తిని అరికట్టే ఉద్దేశంతో డాగ్ స్క్వాడ్ పోలీసులు బస్టాండ్, రైల్వేస్టేషన్, దాబాలలో తనిఖీలు చేపట్టినట్లు ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లిలో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో విద్యార్థులు రెండు రోజులుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం ఉన్నత పాఠశాల ఆవరణ, గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ముళ్ల పొదలను తొలగించారు. ఈ సందర్భంగా ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మోటార్ వెహికల్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ మేరకు మోటర్ అవగాహన చట్టాలు, రోడ్డు భద్రత, హెల్మెట్, మద్యం తాగి వాహనాలు నడపడంతో ఎదురయ్యే ప్రమాదాలను వివరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు రాజా గౌడ్, మల్లేశం, కిరణ్ కుమార్, ప్రోగ్రాం అధికారి వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఆర్డీఓ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురుపూజోత్సవం పురస్కరించుకొని శనివారం మండలంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 31 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ గణేష్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తూప్రాన్‌లో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

తల్లిదండ్రుల పాత్ర కీలకం

టేక్మాల్ (మెదక్): పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమైందని కేజీబీవీ ప్రిన్సిపాల్ బాలమణి తెలిపారు. శనివారం స్థానిక కేజీబీవీలో పోషకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన పీఈటీ రేణుకను తోటి సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఇందులో ప్రిన్సిపాల్ బాలమణి, టీచర్లు గురుశ్యామల, మౌనిక, మోక్షిక, నవనీత, సంధ్య, సుప్రియ, సుజాత, సంతోషి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వాలీబాల్ పోటీలు

చేగుంట(తూప్రాన్): ఈ నెల 22 నుంచి దుబ్బాక నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలునిర్వహిస్తున్నట్లు మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్‌రెడ్డి సౌజన్యంతో నిర్వహించనున్న పీవీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి 24 వరకు దుబ్బాక మున్సిపాలిటీ లచ్చపేట మోడల్ పాఠశాలలో పోటీలు జరగనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 9701205273 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అయితే తప్పనిసరిగా జట్టు పేరును నమోదు చేయించుకోవాలని సూచించారు.

అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శన



జూనియర్ కళాశాలలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సెకండ్ ఇయర్ విద్యార్థులు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరస్పరం పరిచయం చేసుకున్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలు, నృత్య ప్రదర్శనలతో అలరించారు. విద్యార్థి జీవితంలో ఇంటర్ కీలకమని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ నర్సింలు సూచించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు సతీష్, శ్రీనివాస్, సంతోష్, ప్రవీణ్ కుమార్, రమేష్, సంధ్యారాణి, దేవదాసు, నవీన్, ప్రణీత్ రెడ్డి, మధుసూదన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై స్వచ్ఛత ర్యాలీ

మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి

తూప్రాన్: స్థానిక పురపాలక సంఘం పరిధిలో స్వచ్ఛత ఈ సేవ-2025 కార్యక్రమం నిర్వహించారు. శనివారం ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులతో కలిసి స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ఉండాలని సూచించారు. తమ ఇళ్లలో తడి, పొడి చెత్త విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సీఎంఆర్ ఆస్పత్రి వైద్యబృందంతో మున్సిపల్ శానిటేషన్ వర్కర్లకు, ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు అందజేశారు.



ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అంబాజిపేట గ్రామకంఠంలోని కందకం భూమిని కాపాడాలని గ్రామస్తులు తహసీల్దార్ మాలతికి వినతి పత్రం అందించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి అంబాజిపేట గ్రామస్తులు తరలివచ్చారు. ఈ మేరకు గ్రామంలోని దుర్గమ్మగుడి వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని హైదరాబాద్‌కు చెందిన రియల్ వ్యాపారి కొనుగోలు చేశాడని తెలిపారు. అయితే ఈ కందకం భూమిని కలిపి వేయడంతో పాటు బెదిరిస్తున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి ఆలయం భూమితో పాటు కందకం భూమిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, బాబు, చంద్రాగౌడ్, యాదగిరి తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న పోషకాహార ప్రదర్శన



పోషకాహారంపై ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్ వాడీ టీచర్లు, సిబ్బంది

నర్సాపూర్ రూరల్: మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శనివారం అంగన్‌వాడీ టీచర్లు ప్రదర్శించిన పోషకాహార ప్రదర్శన ఆకట్టుకుంది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. ఈ మేరకు గర్భిణులు, బాలింతతో పాటు ఆస్పత్రికి వచ్చే రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రఘువరన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కవిత, లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలతో పాటు కిషోర్ బాలికలు సమతుల్యమైన పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రోటీన్లు ఎక్కువగా లభించే పప్పు దినుసులు, ఆకుకూరలు, గుడ్లు, పాలు, చికెన్, చేపలు వంటి పదార్థాలు తీసుకోవాలన్నారు. అనంతరం పోషకాహారం పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీశైల

టేక్మాల్(మెదక్): గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీశైల తెలిపారు. మండలంలోని ఎల్లుపేట సెక్టార్ ముత్యాలబంధంతండా అంగన్‌వాడీలో శనివారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు పోషణ మాసం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లలిత, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, ఏఎన్ఎం విజయ, ఆశ వర్కర్ సావిత్రి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషణ్‌అభియాన్

రామాయంపేట(మెదక్): మండలంలోని తొనిగండ్ల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సజీలుద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్ సుమలత, ఆశ వర్కర్ మానస, ఏఎన్ఎం ఎల్లమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రామాయంపేట: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ సజీలుద్దీన్

ఆకుకూరలు ఎక్కువగా తినాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆకుకూరల్లో పోషరాలు ఎక్కువగా ఉంటాయని, మహిళలు ఆకుకూరలు ఎక్కువగా తినాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషమాత అన్నారు. శనివారం ఆమె మండల పరిధిలోని గుజిరితండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

◆ **నూతన కమిటీ ఎన్నిక**

పెద్దశంకరంపేట(మెదక్): ఎస్టీయూ మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశం, కోశాధికారిగా ఆనంద్, అసోసియేట్ అధ్యక్షుడిగా సిద్దిరాములు, ఉపాధ్యక్షులుగా సుధీర్, స్వప్న, సాయిలు, సందీప్, సెక్రటరీగా శేఖర్‌గౌడ్, ఫైనాన్స్ కమిటీ మెంబర్స్ , కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఎన్నికల పరిశీలకుడు శ్రీనివాస్ పర్యవేక్షించారు.

◆ **హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో జాతీయ రహదారి 765డీపై కొంతకాలంగా హైమాస్ట్ బట్టర్ఫ్లై లైట్లు వెలగకపోవడంతో గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై హైవే నిర్వహణ అధికారులు స్పందించారు. ఈ మేరకు లైట్లకు క్రేన్ సహాయంతో నాలుగు రోజులుగా మరమ్మతులు చేపట్టారు.

◆ **అన్నదానం**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని అన్ని ఆలయాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. ఇందులో భాగంగానే వెల్మకన్నలో ఉన్న కాలభైరవస్వామి ఆలయం, బాల వీరహనుమాన్ ఆలయంలో ఆలయ పూజారి మెట్టురాములుశర్మ అంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి చందన అలంకరణ పూజలు చేశారు.

◆ **పింఛన్ పెంపు హామీ నెరవేర్చాలి**

వెల్దుర్తి(తూప్రాన్): ఎన్నికల సమయంలో వృద్ధులు, వితంతువుల పింఛన్ పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించిందని ఎమ్మార్పీఎస్ మాసాయిపేట మండల అధ్యక్షుడు ప్రభాకర్ ఆరోపించారు. ఈ మేరకు ప్రభుత్వం తమ హామీని వెంటనే అమలు చేయాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పరమేష్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి వినోద్, మండల ప్రధాన కార్యదర్శి స్వామి, భాస్కర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలని వినతి

చేగుంట(తూప్రాన్): దివ్యాంగులకు పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తూ రుక్మాపూర్‌లో పంచాయతీ కార్యదర్శి బాలుకు ఎంఆర్పీస్ నాయకులు దివ్యాంగుల సంఘం నాయకులు శనివారం వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీస్ మండలశాఖ అధ్యక్షుడు రామస్వామి, ఇవ్యాంగుల హక్కుల పోరాట కమిటీ సభ్యులు భూమయ్య, దేవస్వామి, రఘుపతి, పోచయ్య, ఎంఆర్పీస్ నాయకులు రాములు, దాసు, సత్తయ్య, నర్సవ్వ, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**

నర్సాపూర్: మండల కేంద్రంతోపాటు వెల్దుర్తికి చెందిన 30మంది లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో రూ.12లక్షల 78వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఆయన వెంట నాయకులు మల్లేష్, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **పీహెచ్‌సీ సిబ్బంది వాగ్వాదం**

శివ్వంపేట(నర్సాపూర్): రోగులకు వైద్య సేవలు అందించాల్సిన సిబ్బంది వాగ్వాదానికి దిగిన ఘటన శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటుచేసుకుంది. ఉదయం 11 గంటల సమయంలో విధుల్లో ఉండాల్సిన పలువురు సిబ్బంది ఓ గదిలో వాగ్వాదానికి దిగారు. ఈ విషయంపై వైద్యాధికారి సాయిసౌమ్య దృష్టికి తీసుకెళ్లగా అలాంటిదేమి లేదన్నారు.

◆ **రికార్డులు సక్రమంగా నిర్వహించాలి**

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామ సంఘాల రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఏపీఎం గౌరిశంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వీఓఏలకు గ్రామ సంఘాల రికార్డుల నిర్వహణకు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా శిక్షకుడు దత్తాత్రి మాట్లాడుతూ గ్రామసంఘాల పుస్తకాల్లో ఆర్థిక లావాదేవీలు, సభ్యత్వాల వివరాలను నమోదు చేసే పద్ధతులను వివరించారు. అనంతరం ఏపీయం గౌరీశంకర్.. ఆర్థిక క్రమశిక్షణ ఆదర్శవంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు వెంకటలక్ష్మి, శ్రీకాంత్, లక్ష్మణ్, మానస తదితరులు పాల్గొన్నారు.

◆ **తాళం వేసిన ఇంట్లో చోరీ**

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని శెట్టిపల్లిలో శనివారం తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీను తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టారు. దీంతో అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోంచి ఐదు గ్రాముల బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

◆ **బైక్ దొంగ అరెస్ట్**

మెదక్ మున్సిపాలిటీ: బైక్‌ల దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా చేగుంట మండలం బి.కొండాపూర్‌కి చెందిన వర్దం యాదగిరి అనుమానాస్పదంగా వెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతడిని పట్టుకొని విచారించగా.. కోర్ట్ వద్ద బైక్ దొంగిలించినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడిని రిమాండ్‌కి తరలించారు. గతంలో బైక్ దొంగతనం కేసులో జైలుకు వెళ్లినట్లు తెలిపారు.

◆ **సమయ పాలన పాటించాలని డిమాండ్**

నర్సాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని పేరెంట్స్ కమిటీ ప్రతినిధులతో పాటు బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు సరిగా విధులకు రావడం లేదని ఆరోపించారు. ఈ మేరకు బీజేపీ పట్టణ అధ్యక్షుడు చంద్రయ్య, ఇతర నాయకులు రాజు, రాంరెడ్డి తదితరులు పాఠశాలకు వచ్చి ప్రభుత్వం నిర్దేశించిన సమయ పాలనను పాటించాలని సూచించారు.

◆ **బైక్‌ను ఢీకొట్టిన లారీ**

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ నుంచి పనులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న భార్యభర్తలకు గాయాలయ్యాయి. మండల పరిధిలోని నాగాపూర్ గేటు నక్కవాగు వద్ద సుల్తాన్‌పూర్‌కి చెందిన కెతావత్ బాల్య, మనికిల బైక్‌ను మెదక్ నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో బాల్యకు స్వల్ప గాయాలవ్వగా.. ఆయన భార్య మనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్ఐ రాజు తెలిపారు.

◆ **దుస్తుల పంపిణీ**

నర్సాపూర్: ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజు నుంచి 15రోజుల పాటు బీజేపీ సేవ పక్షం పేరిట సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించిందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ వెల్లడించారు. ఇందులో భాగంగా సేవ పక్షం కార్యక్రమాల్లో భాగంగా శనివారం స్థానిక మున్సిపాలిటీ సిబ్బందికి అజయ్ యాదవ్ ట్రస్టు ఆధ్వర్యంలో బట్టలు పంపిణీ చేసినట్లు ఆయన చెప్పారు. ట్రస్టు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు.